జస్టిస్ నాగార్జున పదవీ విరమణ

మద్రాస్ హైకోర్టులో ఘనంగా వీడ్కోలు

చెన్నై, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన తెలంగాణ బిడ్డ జస్టిస్ దేవరాజ్ నాగార్జున బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మద్రాస్ హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ కృష్ణకుమార్ అధ్యక్షతన ఇతర న్యాయమూర్తులంతా సమావేశమై జస్టిస్ నాగార్జునకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన వెలువరించిన కీలక తీర్పులను ప్రస్తావిస్తూ.. న్యాయ వ్యవస్థకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ నాగార్జున కుటుంబసభ్యులతోపాటు హైకోర్టు న్యాయాధికారులు, సీనియర్ న్యాయవాదులు, సిబ్బంది హాజరయ్యారు. 1962 ఆగస్టు 15న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో దేవరాజ్ రామకృష్ణారావు, విమలాదేవి దంపతులకు జన్మించిన నాగార్జున.. ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల విద్య, వనపర్తిలోని ఆర్ఎల్‌డీ కాలేజీలో బీఎస్సీ, గుల్బర్గాలో లా, పీజీ డిప్లొమా, ఉస్మానియా వర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ లాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.

జస్టిస్ నాగార్జున ప్రస్థానం ఇదీ..

1986లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన జస్టిస్ నాగార్జున.. తన తండ్రి రామకృష్ణారావు వద్ద జూనియర్‌గా న్యాయజీవితాన్ని ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ-కోర్టుల్లో పలు కేసులను సమర్థంగా వాదించారు. 1991 మే 1న జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఆయన.. 2004లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందే వరకు వివిధ ప్రాంతాల్లో పనిచేయడంతోపాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా, ఏపీ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందించారు. కామారెడ్డి, నిజామాబాద్, రంగారెడ్డి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా పనిచేసిన జస్టిస్ నాగార్జున.. 2010 సెప్టెంబర్ 17న జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. 2002 నుండి 2004 వరకు ఇంటర్నేషనల్ కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్‌లో పరిశోధన చేసిన జస్టిస్ నాగార్జునకు అమెరికా (బర్కిలీ)లోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్ లభించింది. అదే సమయంలో జస్టిస్ నాగార్జున ఎల్ఎల్ఎం (ఇంటర్నేషనల్ లా), ఏషియన్ స్టడీస్‌లో ఎంఏ, 2013లో నల్సార్ యూనివర్సిటీ నుంచి 'ఏ క్రిటికల్ అనాలిసిస్ ఆఫ్ ఇట్స్ ఇంపాక్ట్స్ ఆన్ ది ఇండియా లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. 2015 అక్టోబర్ 3 నుంచి 2021 సెప్టెంబర్ 2 వరకు హైకోర్టు రిజిస్ట్రార్‌గా, ఆ తర్వాత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేసిన ఆయన.. 2022 మార్చి 24న హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిరుడు ఏప్రిల్ 6న బదిలీపై మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు.

మానవ రహిత సబ్‌స్టేషన్ల ప్రారంభం

- హనుమకొండ, వరంగల్‌లో సేవలు అందుబాటులోకి

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 14: ఎన్‌పీడీసీఎల్‌లో పూర్తి సాంకేతికతను ఉపయోగిస్తూ ఏర్పాటు చేసిన మానవ రహిత సబ్‌స్టేషన్లను విద్యుత్తు శాఖ అధికారులు బుధవారం అందుబాటులోకి తెచ్చారు. హనుమకొండలోని నక్కల గుట్ట, వరంగల్ ఏజే మిల్లు గ్రౌండ్ వద్ద వీటి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 30 వరకు హనుమకొండ, వరంగల్‌లో దాదాపు 20 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన ఏ సమాచారమైనా స్కాడా సెంటర్‌కు వస్తుందని, అక్కడ ఉన్న టెక్నికల్ టీం దీనిని పర్యవేక్షిస్తుందని వివరించారు. ఎలాంటి ట్రిప్పింగ్ జరిగినా వెంటనే అలారంతో కూడిన సమాచారం వస్తుందని, టీం సభ్యులు అప్రమత్తమై ఆన్ చేస్తారని తెలిపారు. ఒకవేళ బ్రేక్ డౌన్ అయినా.. వెంటనే సంబంధిత ఇంజినీర్‌కు, స్కాడా సెంటర్‌కు సమాచారం అందుతుందని చెప్పారు. రోజురోజుకూ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి, అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు సీఎండీ తెలిపారు.

పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. 78వ స్వాతంత్ర్య వేడుకలకు సెక్రటేరియట్‌ను రంగురంగుల లైట్లతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమరవీరుల స్తూపం, ట్యాంక్‌బండ్ తదితర ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి అందంగా తీర్చిదిద్దారు.

ఆరుగురు ఎస్పీలకు పదోన్నతి

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ఆరుగురు నాన్‌క్యాడర్ ఎస్పీలకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర హోంశాఖ బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. సీనియార్టీ ప్రకారం 8 మంది జాబితాను సిద్ధం చేసి పంపగా వై సాయిశేఖర్, సమయ్ జాన్‌రావుకు కొన్ని అభ్యంతరాలతో ఇవ్వలేదు. మిగతా వారైన బీ రామ్‌రెడ్డి, సీహెచ్ శ్రీధర్, ఎస్ చైతన్యకుమార్, ఏ భాస్కర్, కే నరసింహ, కే శిల్పవల్లికి ఐపీఎస్ హోదా ఇచ్చింది.

క్యూఆర్ కోడ్‌తో రైల్వే టికెట్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): టికెట్ జారీ కోసం దక్షిణ మధ్య రైల్వే జోన్ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నది. రైల్వే టికెట్ జారీ కోసం ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో అన్ని రైల్వేస్టేషన్లలో క్యూఆర్ కోడ్ విధానం అమల్లోకి తీసుకువచ్చింది. నగదు రహిత లావాదేవీలను తగ్గించి, డిజిటల్ చెల్లింపులు పెంచడానికి వీలుగా ఈ విధానాన్ని తీసుకువచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయంలో చేపలవేటపై ఆంక్షలు

హైదరాబాద్, ఆగస్టు (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం జలాశయ పరిసరాల్లో చేపల వేటపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. జూలై, ఆగస్టులో చేపల సహజ సంతానోత్పత్తి సమయమని, ఈ సమయంలో శ్రీశైలం జలాశయం, బ్యాక్ వాటర్స్‌లో చేపల వేట వద్దని ఆదేశించింది.

మెట్రో పార్కింగ్‌కు ఫీజుల మోత

- నాగోల్‌లో 25 నుంచి.. మియాపూర్‌లో వచ్చే నెల 1 నుంచి అమలు
- భగ్గుమన్న మెట్రో ప్రయాణికులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): ఇప్పటివరకు నాగోల్, మియాపూర్ మెట్రో రైలు డిపో ప్రాంతాల వద్ద ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించిన మెట్రో రైలు ఇకనుంచి పార్కింగ్ ఫీజులు వసూలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ నెల 25 నుంచి నాగోల్ పార్కింగ్ లాట్‌లో, సెప్టెంబర్ 1 నుంచి మియాపూర్ మెట్రో పార్కింగ్ లాట్‌లో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నాగోల్ మెట్రోస్టేషన్ పక్కనే ఉన్న పార్కింగ్ లాట్‌లో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయడంతో ఆగ్రహానికి గురైన మెట్రో రైలు ప్రయాణికులు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

నాగోల్, మియాపూర్ పార్కింగ్ లాట్‌ల్లో పార్కింగ్ ఫీజులు (రూపాయల్లో..)

గంటలు	ద్విచక్ర వాహనం	కారు
2 గంటలపాటు	10	30
8 గంటలపాటు	25	75
12 గంటలపాటు	40	120
ఆ తర్వాత ప్రతి గంటకు	5 (అదనం)	15 (అదనం)

ట్రావెల్ ప్యాకేజీలతో జాగ్రత్త!

- సైబర్ మోసానికి గురయ్యే అవకాశం:సీఎస్‌బీ

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): వరస సెలవులు ఉండటం వల్ల ప్రయాణాలు చేసేముందు యాత్రికులు, పర్యాటకులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం, పోలీసులు హెచ్చరించారు. ట్రావెల్ ప్యాకేజీ బుక్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విమాన, హోటల్, రవాణా ప్యాకేజీలు ఆన్‌లైన్‌లో బుక్ చేసేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ఆకర్షణీయమైన ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియాల్లో ప్రలోభపెట్టి.. ఆఖరికి అందినంత లాగేస్తారని, అనుమానాస్పద లింకులు, ప్రకటనలు క్లిక్ చేసి, మోసపోవద్దని సూచించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.